నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ అవార్డు**

ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జీ నాగేశ్వర రెడ్డికి 'లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ' అవార్డు లభించింది. జపాన్‌లో ఏప్రిల్ 12, 13 తేదీల్లో నిర్వహించిన 'టోక్యో లైవ్ గ్లోబల్ ఎండోస్కోపీ -2025' కార్యక్రమంలో ఈ అవార్డును షోవా యూనివర్సిటీ డైజెస్టివ్ డిసీజెస్ సెంటర్ చైర్మన్ డాక్టర్ హరుహిరో ఇనోయే అందజేశారు. ఈ అవార్డును పొందిన తొలి భారతీయ గ్యాస్ట్రోఎంటరాలజిస్టుగా నాగేశ్వర రెడ్డి నిలిచారు.

nipuna
Every Wednesday Free Supplement
03.
7 మే 2025
పేజీలు 8

# నాన్ ముల్కీలతో నియామకం.. ముల్కీల్లో రగిలిన ఉద్యమం

**గ్రూప్స్ ప్రత్యేకం**
**తెలంగాణ ఉద్యమ చరిత్ర**

**1. నిజాంల కాలంలో ఎవరి సంస్కరణల తరువాత కాలంలో ముల్కీ, నాన్ ముల్కీ మధ్య వివాదాలకు కారణం?**
1) మహరాజ కిషన్ పెర్షాద్
2) సర్ అక్బర్ హైదరీ
3) మీర్ లాయక్ అలీ ఖాన్
4) మీర్ తురబ్ అలీఖాన్

**సమాధానం:** 4) మీర్ తురబ్ అలీఖాన్

**వివరణ:** హైదరాబాద్ రాజ్యంలో నిజాం పరిపాలన కాలంలో 1853 నుంచి 83 వరకు ప్రధానిగా పని చేసిన మొదటి సాలార్ జంగ్ అసలు పేరు మీర్ తురబ్ అలీఖాన్. సాలార్ జంగ్ అనే బిరుదును బ్రిటిష్ వారు ఇచ్చారు.

- సాలార్ జంగ్ పాత ఫ్యూడల్ పరిపాలనను రద్దు చేసి బ్రిటిష్ ఇండియా తరహాలో ఆధునిక కేంద్రీకృత పరిపాలన వ్యవస్థను ప్రవేశ పెట్టారు. స్థానికుల్లో (ముల్కీలు) తగిన స్థాయి విద్యార్హతలు, నైపుణ్యాలు లేనందున బ్రిటిష్ ఇండియా నుంచి వచ్చిన విద్యావంతుల (నాల్ ముల్కీలు)కు ఉద్యోగావకాశాలు కల్పించడం ముల్కీ, నాన్ ముల్కీల మధ్య వివాదాలకు కారణమైంది. హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ వ్యవస్థను స్థాపించిన మొదటి సాలార్ జంగ్ అలీగఢ్ యూనవర్సిటీ నుంచి విద్యావంతులను హైదరాబాద్‌కు ఆహ్వానించాడు. వీరు స్థానిక ఉద్యోగులకు శిక్షణ అందించి తిరిగి వెళ్లిపోతారని స్థానికులు భావించారు. కానీ వీరు ఇక్కడే తిష్టవేసి ఉన్న ఉద్యోగాలే గాక రాబోయే ఉద్యోగాల్లో కూడా తమ వారిని నియమించుకుని ముల్కీలకు అన్యాయం చేశారు.

**నోట్:** ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించి నూతన జోనల్ విధానాన్ని ప్రవేశ పెట్టడంతో పాటు 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కే విధంగా సంస్కరణలను చేపట్టారు.

**2. ఏ నిజాం కాలంలో పరిపాలనాధికారులను పెద్ద ఎత్తున రాజ్యం బయటి నుంచి రప్పించారు?**
1) నాసిర్ ఉద్దౌలా
2) అఫ్జల్ ఉద్దౌలా
3) మీర్ మహబూబ్ అలీఖాన్
4) సికందర్ జా

**సమాధానం:** 3) మీర్ మహబూబ్ అలీఖాన్

**వివరణ:** ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911) పాలనలో ఇతర రాష్ట్రాల నుంచి పరిపాలనాధికారులను రప్పించారు.



ఇది హైదరాబాద్ రాజ్యంలో పరిపాలన, సామాజిక వ్యవస్థను గణనీయంగా మార్చింది. మీర్ మహబూబ్ అలీఖాన్ 1869లో చిన్న వయసులోనే సింహాసనం అధిష్ఠించాడు. ఆయన పెద్దవాడయ్యే వరకు రీజెన్సీ కౌన్సిల్ ద్వారా పాలన కొనసాగింది. ఈ కాలంలో మొదటి సాలార్ జంగ్ ప్రవేశ పెట్టిన పాలన సంస్కరణలు అమలవుతూనే ఉన్నాయి. ఈ సమయంలో హైదరాబాద్‌లో విద్యావంతులైన, నైపుణ్యం కలిగిన స్థానికుల (ముల్కీల) కొరత ఉండేది. ఆధునిక పరిపాలనను సమర్థవంతంగా కొనసాగించేందుకు విద్యావంతుల అవసరం ఏర్పడటంతో మద్రాస్, బొంబాయి, బెంగాల్ ప్రెసిడెన్సీ నుంచి బయటి అధికారులను (నాన్ ముల్కీలు) నియమించారు. వీరి ఆంగ్ల విద్య, చట్టం, పరిపాలన, సాంకేతిక రంగాల్లో అవగాహన ఉండటంతో వీరు ఉన్నత పదవులను పొందడంలో పైచేయి సాధించారు.

- భారీ నియామకాల వల్ల స్థానికు (ముల్కీలు)ల్లో అసంతృప్తి పెరిగింది. ఈ పరిస్థితి 20వ శతాబ్దంలో ముల్కీ, నాన్ ముల్కీ ఉద్యమానికి పునాది వేసింది. చివరకు 1919లో ముల్కీ రూల్స్ ప్రవేశ పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

**నోట్:** ముల్కీ, నాన్ ముల్కీ వివాదం నిజాంల కాలంలో పరిష్కరించకపోవడమే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఆరు దశాబ్దాల పాటు కొనసాగింది. దీనికి వ్యతిరేకంగా కొనసాగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం చివరకు 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో విజయవంతమయ్యింది.

**3. మీర్ ఉస్మాన్ అలీఖాన్ జారీ చేసిన ఫర్మానా ఆధారంగా హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ రెగ్యులేషన్లను ఏ సంవత్సరంలో ప్రకటించారు?**
1) 1917
2) 1918
3) 1919
4) 1916

**సమాధానం:** 3) 1919

**వివరణ:** ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911 నుంచి 1948 వరకు హైదరాబాద్ రాజ్యాన్ని పరిపాలించాడు. ప్రభుత్వ పరిపాలన విస్తరించడంతో బ్రిటిష్ ఇండియా తరహాలో ఒక శాసనబద్ధమైన పరిపాలనా వ్యవస్థ అవసరంగా మారింది. అప్పటి వరకు ఉద్యోగ నియామకాలు, వేతనాలు, పదోన్నతులు, సెలవులు, పదవీ విరమణ తదితర విషయాల్లో సుస్పష్టమైన నిబంధనలు లేకపోవడంతో ప్రభుత్వంలో అలసత్వం, నిర్లక్ష్యం, అవినీతి క్రమంగా పెరిగిపోయింది.

- 1933లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ జారీ చేసిన ఫర్మానా ఆధారంగా హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ రెగ్యులేషన్స్ (హెచ్‌సీ ఎస్ఆర్)ను రూపొందించి అమల్లోకి తెచ్చారు. దీనిలో ఉద్యోగ నియామక పద్ధతులు, వేతన సరళి, సెలవుల నిబంధనలు, పెన్షన్ హక్కులు, ఉద్యోగులు ప్రవర్తనా నియమాలు వంటివి స్పష్టంగా పేర్కొన్నారు.
- ఈ నియమావళితో హైదరాబాద్ పరిపాలనా వ్యవస్థ సంస్థాగత రూపం దాల్చింది. ప్రవర్తనా నియమాలు, ఉద్యోగ భద్రత కల్పించడంతో పరిపాలనలో నాణ్యత పెరిగింది.
- ఈ నియమావళి ఆధునిక హైదరాబాద్ పరిపాలనకు కీలక సాధనంగా దోహదపడి నప్పటికీ ఉద్యోగాల్లో నాన్ ముల్కీలు ఎక్కువగా ఉండటంతో ముల్కీల్లో అసంతృప్తి మరింత పెరిగింది.

**నోట్:** ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముల్కీల హక్కుల పరిరక్షణ కోసం 1919లో ఒక ఫర్మానా జారీ చేశారు. ఈ ఫర్మానాకు భిన్నంగా నాన్ ముల్కీల ఆధిపత్యం 1930 నాటికి మరీ ఎకువైె చివరికి పంజాబ్‌కు చెందిన ఖాన్ సాహెబ్‌లను ఉన్నత ఉద్యోగాల్లో నియమించడంతో అన్ని శాఖల్లో నాన్ ముల్కీల ఆధిపత్యం ప్రమాదకర స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1933లో ముల్కీల ఉద్యోగాల రక్షణ కోసం మరో ఫర్మానాను జారీ చేశారు. ఈ ఫర్మానా ఆధారంగా హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ రెగ్యులేషన్స్‌ను రూపొందించారు. ఇది ఆధునిక పరిపాలనకు దారితీసిన ఒక ముఖ్యమైన సంస్కరణ. ఉద్యోగాలపై స్థానికులకు ఎదురవుతున్న అసమానతలు ముల్కీ, నాన్ ముల్కీ వివాదాన్ని మరింత తీవ్రమయ్యేలా చేశాయి.

**4. కింది వ్యాఖ్యల్లో పరిగణించండి?**
ఎ. హైదరాబాద్ ప్రభుత్వం 1946, 1948 మధ్య దాదాపు 50,000 మంది ముస్లింలను బయటి నుంచి రప్పించి మిలిటరీ పోలీసు, ఆబ్కారీ శాఖల్లో నియమించింది
బి. పోలీస్ చర్య తరువాత స్థానికులు అర్హులైనప్పటికీ స్థానికేతరులకు రాజ్యంలో ఉద్యోగాలు ఇవ్వడం పట్ల కొండా వెంకట రంగారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశాడు
సి. పోలీస్ చర్య తరువాత రాజ్యంలో ఉన్నత పదవులు పొందిన స్థానికేతరులు తమ బంధువులను, స్నేహితులను స్థానిక ఉద్యోగాల్లో తమ అధికారాన్ని ఉపయోగించి నియామకాలు చేశారు
డి. వీటన్నింటి వల్ల ముల్కీయేతరులు వెనక్కి వెళ్లండి అనే ఉద్యమం ప్రారంభమైంది

**సమాధానం:** ఎ, బి, సి, డి

**5. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ 1968లో ఎందుకు తెలంగాణ రక్షణల ఉద్యమాన్ని ప్రారంభించింది?**
ఎ. తెలంగాణ ఉద్యోగుల రక్షణలను ప్రభుత్వం పక్షపాతంగా ఉల్లంఘించినందుకు
బి. ముల్కీ నియమాలు, నిబంధనలను ఉల్లంఘించినందుకు
సి. కేంద్ర ప్రభుత్వం, కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను ఆచరణలో పెట్టకపోవడం వల్ల
డి. బోగస్ ముల్కీ సర్టిఫికెట్ల సహాయంతో ఆంధ్ర ప్రాంతం వారిని ఉద్యోగులు నియమించడం వల్ల

**సమాధానం:** ఎ, బి, సి, డి

**6. పెద్ద మనుషుల ఒప్పందానికి సంబంధించి కింది వాటిలో సరైనవి?**
ఎ. రెండు ప్రాంతాల జనాభా ప్రాతిపదికన భవిష్యత్తులో ఉద్యోగ నియామకాలు ఉంటాయి
బి. తెలంగాణలోని వ్యవసాయ భూముల అమ్మకం రీజినల్ కౌన్సిల్ నియంత్రణలో ఉంటాయి
సి. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో భవిష్యత్తు అభివృద్ధిని అంచనా వేయడానికి ఈ రెండు ప్రాంతాల్లో రీజినల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి
డి. విధాన సభ మెజారిటీ సభ్యుల అభిప్రాయం ప్రకారం తెలంగాణలో మద్యపాన నిషేధం అమలవుతుంది

**సమాధానం:** ఎ, బి

**వివరణ:** హైదరాబాద్ రాష్ట్ర, ఆంధ్ర రాష్ట్రం విలీనమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు ఆధారమైన పెద్ద మనుషుల ఒప్పందం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో 1956, ఫిబ్రవరి 20న కుదిరింది. ఈ ఒప్పందంపై ఆంధ్ర రాష్ట్రానికి చెందిన బెజవాడ గోపాల రెడ్డి, నీలం సంజీవ రెడ్డి, గౌతు లచ్చన్న, ఎం సత్యనారాయణ, హైదరాబాద్ రాష్ట్రానికి చెందిన బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, కేవీ రంగారెడ్డి, జేవీ నర్సింగరావు సంతకాలు చేశారు (అందరూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే).

- పెద్ద మనుషుల ఒప్పందంలో 14 అంశాలు పేర్కొన్నారు.
- ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు వల్ల తెలంగాణ ప్రాంతానికే నష్టం జరిగే ప్రమాదం ఉన్నందున రీజినల్ కౌన్సిల్‌ను కేవలం తెలంగాణ కోసం మాత్రమే ఏర్పాటు చేశారు. అందువల్ల 'సి' అంశం తప్పు.
- శాసనసభలోని తెలంగాణ సభ్యులు ఏ విధంగా నిర్ణయిస్తే ఆ విధంగా మద్య నిషేధం అమలు చేయాలి. అందువల్ల 'డి' అంశం తప్పు.

**7. 1969, జనవరి 18, 19 తేదీల్లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి సంబంధించి కింది వ్యాఖ్యల్లో సరైనవి?**
ఎ. తెలంగాణలో ముల్కీ నిబంధనలను ఉల్లంఘించి ఉద్యోగాలు పొందిన వ్యక్తులను వెనక్కి పంపి వారి స్థానంలో స్థానికులను నియమించాలి
బి. బోగస్ ముల్కీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను పొందిన వారి విషయంలో విచారణ చేపట్టాలి

**సమాధానం:** ఎ, బి

**వివరణ:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ప్రభావంతో 1969, జనవరి 18, 19 తేదీల్లో నిర్వహించిన అఖిలపక్ష ఒప్పందానికి మూలం నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీఎస్ రెడ్డిని తొలగించి గుంటూరుకు చెందిన డా. పిన్నమనేని నరసింహారావును వైస్ చాన్స్‌లర్‌గా నియమించాడు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో పిన్నమనేని రాజ్‌భవన్‌లోనే పదవి స్వీకరించినప్పటికీ న్యాయస్థానం అతని ఎంపిక చెల్లదని కొట్టి వేయడంతో పిన్నమనేనిని గుంటూరుకు వెళ్లిపోయాడు.

- ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల్లో ఐక్యతను దెబ్బతీసి నాటి ముఖ్యమంత్రి తనకు అనుకూల వర్గాన్ని ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేశాడు. తెలంగాణ రక్షణల ఉద్యమాన్ని తన అనుకూల విద్యార్థి నాయకుల నేతృత్వంలో నడిపించాలనుకుని అనేక ఎత్తుగడలు వేసినప్పటికీ ఓయూ విద్యార్థులు మాత్రం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమాన్ని ఉధృతం చేశారు.
- ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండు రకాల చర్యలకు పూనుకున్నది. ఒకవైపు తెలంగాణ రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఆంధ్రలో విద్యార్థులు, ఉద్యోగులను రెచ్చగొట్టి ఆందోళనలు లేవదీయడం, మరోవైపు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి తెలంగాణ రక్షణల అమలు విషయంలో ఒక నిర్ణయానికి వచ్చింది. దీన్నే అఖిలపక్ష ఒప్పందం అంటారు.
- అఖిలపక్ష ఒప్పందంలో ఆరు అంశాలు పేర్కొన్నారు. ప్రశ్నలో పేర్కొన్న రెండు అంశాలు సరైనవే. మిగతా నాలుగు అంశాలు..

1) ముల్కీ నిబంధనలను మరికొంత కాలం పొడిగించాలి. ఆ నియామకాలను స్వయం ప్రతిపత్తి గల సంస్థలకు కూడా వర్తింపజేయాలి.
2) ఉద్యోగుల సీనియారిటీకి సంబంధించిన వివాదాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి.
3) ఆంధ్ర ప్రాంతానికి తరలించిన తెలంగాణ మిగులు నిధులను లెక్కకట్టి ఆ నిధులను తెలంగాణకు కేటాయించాలి.
4) హైదరాబాద్ నగరంలో విద్యావసతులను విస్తరింపజేయాలి.

**8. కింది వ్యాఖ్యల్లో సరైనవి?**
ఎ. ఆంధ్రాలోని అనేక ప్రాంతాల్లో 1972లో ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళన ప్రారంభించారు
బి. సత్వరమే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు స్వామినాథన్ డిమాండ్ చేశారు

**సమాధానం:** ఎ, బి

**వివరణ:** నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేయగా తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావు 1975, సెప్టెంబర్ 25న సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 1972 అసెంబ్లీ ఎన్నికల అనంతరం 1972, మార్చి 20న పీవీ నరసింహారావు రెండోసారి సీఎం అయ్యారు.

- ఈ నేపథ్యంలో 1972, అక్టోబర్ 3న సుప్రీంకోర్టు ముల్కీ నియమాలపై కీలకమైన తీర్పునిచ్చింది. అంతకుమందు కోర్టులు 1957లో కేంద్ర ప్రభుత్వం స్థానిక రిజర్వేషన్లను కల్పిస్తూ తెచ్చిన చట్టాన్ని కొట్టివేశాయి. 1957 చట్టం అప్పటి వరకు స్థానిక రిజర్వేషన్లను కల్పించే నియమాలు, చట్టాలను రద్దు చేసింది. కాబట్టి 1957 చట్టం రద్దు కావడంతో స్థానిక రిజర్వేషన్లకు అవకాశం లేదన్న భావన ఉండేది. కానీ సుప్రీంకోర్టు అందుకు భిన్నంగా 1957 చట్టం రద్దు కావడంతో నిజాం ప్రవేశ పెట్టిన ముల్కీ నిబంధనలు చెల్లుతాయని తీర్పునిచ్చింది. ఆంధ్ర-తెలంగాణ ప్రాంతాల విలీనంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించినప్పటికీ ముల్కీ నిబంధనలు అమల్లో ఉన్నట్లేనని సుప్రీంకోర్టు పేర్కొనడంతో ఆంధ్ర ప్రాంతంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం ప్రారంభమైంది.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

